సాక్షి ఒడిశా

సోమవారం ၊ 15 ၊ ఏప్రిల్ ၊ 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 6,27,536

బంగారం 1 గ్రాము 100 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

అంబేడ్కర్‌ను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా పలువురు నివాళులు అర్పించారు.

- 8లో.



ముగిసిన దొండనచో దీక్షలు

దొండనచో దీక్షలు ఆదివారంతో ముగిశాయి. దీక్షా ధారులు దొండ కాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దీక్షలు విరమించారు.

- 8లో.

న్యూస్‌రీల్

శ్రీరామనవమి ఉత్సవాలకు సన్నాహాలు

భువనేశ్వర్: శ్రీరామనవమి ఉత్సవాలకు స్థానిక ఆంధ్ర సంస్కృతి సమితి భారీ సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 17 నుంచి 22 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమితి కార్యదర్శి జి.లక్ష్మణరావు తెలిపారు. నిత్యం ఉదయం 5 గంటల నుంచి ఉత్సవ పూజాదులు ప్రారంభించి సాయంత్రం 6 గంటలకు ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. గీతా పారాయణం, సుందరకాండ పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం, శ్రీ రామ రక్షా స్తోత్ర పారాయణం వంటి కార్యక్రమాలతో పాటు సీతారామ కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. సాయంత్రం వేళ బుర్రకథ, హరికథ వంటి సంప్రదాయ కాలక్షేప కార్యక్రమాలు కూడా కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఘనంగా ఒడియా సాహిత్య దినోత్సవం



బహుమతులు అందుకున్న కవులతో నిర్వాహకులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని మల్కన్‌గిరిలో ఆదివారం ఏక్స్ బోర్డు పాఠశాలలో ఒడియా సాహిత్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్ చంద్ర పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై కవితా సమ్మేళనం ప్రారంభించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు గౌతమ్ సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేడీ కాల్ సెంటర్ ప్రారంభం




ప్రారంభోత్సవంలో నెక్కంటి, అనసూయా మాఝిలు

రాయగడ: స్థానిక తేజస్వీ హోటల్ గ్రౌండ్‌లో కొత్తగా నిర్మించిన భవనంలో ఏర్పాటు చేసిన బీజేడీ కాల్‌సెంటర్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఆదివారం ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు అందుబాటులో ఉండేందుకు ఈ కాల్ సెంటర్ ఉపయోగపడుతుందని నెక్కంటి తెలిపారు. కార్యక్రమంలో రాయగడ శాసన సభ బీజేడీ అభ్యర్థి అనసూయా మాఝి తదితరులు పాల్గొన్నారు.

ఖుర్దా జిల్లాలో 16 సహాయక పోలింగ్ స్టేషన్లు

భువనేశ్వర్: ఖుర్దా జిల్లాలో ఒకేసారి జరగనున్న లోక్‌సభ, శాసన సభ ఎన్నికల కోసం 16 సహాయక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆమోదించింది. ఖుర్దా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సహాయక పోలింగ్ కేంద్రాల గురించి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల రిటర్నింగ్ అధికారులకు లేఖ ద్వారా తెలియజేశారు. ఖుర్దా జిల్లాలో ఏర్పాటు కానున్న సహాయక పోలింగ్ స్టేషన్లలో భువనేశ్వర్ సెంట్రల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఒకటి, భువనేశ్వర్ నార్త్‌లో 5, ఏకామ్రాలో 9, ఖుర్దా నియోజకవర్గంలో 1 ఉన్నాయి. దీంతో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం పోలింగ్ కేంద్రాలు 948కి చేరాయి. పట్టణ ప్రాంతాల్లో 1600 మందికి పైగా, గ్రామీణ ప్రాంతాల్లో 1500 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు రాజకీయ పార్టీలకు తెలియజేయాలని, సహాయక పోలింగ్ కేంద్రాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

131 కేజీల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి పర్కన్‌పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి మత్తిలి పోలీసులు 131 కేజీల గంజాయి పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్లు అందిన సమాచారం మేరకు మత్తిలి ఐఐసీ దేవ్‌దత్త్ మల్లిక్ సిబ్బందితో కలిసి పర్కన్‌పల్లి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. పోలీసుల రాకతో నిందితులు పరారయ్యారు. ఆ ప్రాంతంలో రూ.8లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఒడియా కొత్త సంవత్సరాది.. పొణా సంక్రాంతి



పూరీ సాగర తీరంలో కొత్త సంవత్సరాది శుభాకాంక్షలు తెలియజేస్తూ సైకత శిల్పం



చల్లని పానకం తయారీ



పానకం తయారీ పదార్థాలు



గ్లాసులలో పంపిణీకి సిద్ధంగా..



పశుపక్ష్యాదుల కోసం ఏర్పాటు చేసిన జలపాత్ర

- వాడవాడలా పానకం పంపిణీ
- పశుపక్ష్యాదుల కోసం జలపాత్రల ఏర్పాటు

భువనేశ్వర్: ఒడియా ప్రజలకు నూతన సంవత్సరాది పొణా సంక్రాంతి. ఈ రోజు నుంచి వసంతం ముగిసి గ్రీష్మ రుతువు ఆరంభమవుతుంది. దేశ, విదేశాలు, పల్లె, పట్టణ ప్రాంతాల్లో నివసించే రాష్ట్ర ప్రజలంతా కొత్త సంవత్సరాదిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏటా హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఒడియా కొత్త సంవత్సరంగా పరిగణించడం ఆచారంగా వస్తోంది.

పానకం ప్రీతికరం..

పొణా అంటే పానకం. కొత్త సంవత్సరాదిలో పానకం ప్రధానం. ఒడియా పంచాంగం ప్రకారం తొలి సంక్రాంతి పొణా సంక్రాంతిగా ప్రాచుర్యం పొందింది. వేసవి తొలి రోజు నుంచే వడ దెబ్బ వంటి విపత్తు నిర్వహణకు సంకేతంగా పాణకంతో తొలి రోజుకు శ్రీకారం చుట్టడం విశేషం. శరీరానికి చలువ చేసే పదార్థాలతో పానకం ఇంటింటా తయారు చేస్తారు. ఇందులో ప్రధానమైనది మారేడు కాయ గుజ్జు. దీనికి బెల్లం, పెరుగు, మిరియాల పొడి జోడించి పాణకం తయారు చేస్తారు. దీనిలో పన్నీరు, కొబ్బరి కోరు, అరటి ఇతరేతర పండ్లు కలిపి సేవిస్తారు. వాడవాడలా చలివేంద్రాల తరహాలో పాణకం సామూహికంగా వితరణ చేసి బాటసారులకు దాహం నివారించే సామాజిక సందేశం ప్రచారం చేస్తారు.

బిందు తర్పణం..

వసంతం కనుమరుగు కావడంతో చిగురు తొడిగిన చిరు మొక్కల సంరక్షణకు పొణా సంక్రాంతి నాంది పలుకుతుంది. ఈ సందర్భంగా వాకిట్లో తులసి మొక్కకు ఉట్టి ఏర్పాటు చేసి కలశాన్ని పానకంతో నింపుతారు. ఈ కలశం నుంచి పాణకం తులసి మొక్కపై ఒక్కో బొట్టుగా కారుతూ నిరంతర జలాధారం కల్పిస్తుంది. మర్నాటి నుంచి నిత్యం ఈ కలశాన్ని నీటితో నింపుతారు. బొట్టు బొట్టుగా కారే ప్రతి నీటి బిందువు తులసి మొక్క నిత్యం నవనవలాడేందుకు జీవనాధారంగా నిలుస్తుంది.

జల పాత్ర..

పొణా సంక్రాంతిలో భాగంగా పశుపక్ష్యాదుల దాహార్తి తీర్చేందుకు వీధులు, వాకిళ్ల ప్రాంగణాల్లో నీటితో నింపిన పాత్రలు ఏర్పాటు చేస్తున్నారు.

పంచాంగ శ్రవణం..

కొత్త సంవత్సరాది పురస్కరించుకుని పూరీ జగన్నాథుని సన్నిధిలో కొత్త పంచాంగం విశేషాలు పఠించడంతో పంచాంగ వినియోగానికి శ్రీకారం చుడతారు. హనుమాన్ జయంతి నాడు కొత్త సంవత్సరం కావడంతో ఆంజనేయుని పూజాదులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇలవేలుపు, గ్రామ దేవతకు విశేషంగా అర్చిస్తారు.

మానవాళికి చల్లని సందేశం..

మానవాళితో సమగ్ర జీవరాశి సంక్షేమం ఒడియా సంవత్సరాది విశిష్టత. ప్రకృతి సంపద మొక్కలు, పశు పక్ష్యాదుల సంరక్షణ పట్ల దృష్టి సారిస్తూ ఇంటిల్లపాదీ చల్లని పానీయాల సేవనతో తీవ్ర వేడిమి బారిన పడకుండా రక్షణ పొందుతారు.

- రాయగడ: ఒడియా ప్రజల కొత్త సంవత్సరంగా పిలవబడుతున్న పొణా సంక్రాంతిని రాయగడలో ఘనంగా నిర్వహించారు. అన్ని కూడళ్లలో పానకం (పొనా) పంచిపెట్టారు.
- బరంపురం: బరంపురం ఎన్‌టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో రామలింగేశ్వర్ మెయిన్ రోడ్‌లో మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. పెద్ద బజార్ మెయిన్ రోడ్‌లో వాసవీ క్లబ్ బరంపురం ఆధ్వర్యంలో పానకం పంచిపెట్టారు.



నిలువెత్తు భవంతిలో తులసి మొక్క సంరక్షణకు ఏర్పాటు చేసిన పానకం ఉట్టి



పల్లె ప్రాంతాల్లో ఇలా ...



రాయగడ: పానకం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



మల్కన్‌గిరి: తరణి మందిరంలో..



బరంపురం: పానకం పంపిణీ చేస్తున్న ఎన్‌టీఆర్ సేవా సమితి ప్రతినిధులు



బరంపురం: పానకం పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

కాంగ్రెస్ రెబల్‌గా నీలమాధవ ఉలక!



నీలమాధవ ఉలక ఫొటోతో ఉన్న బనియన్ పోస్టర్

- బిసంకటక్‌లో మారుతున్న సమీకరణలు
- అధిష్టానానికి కొత్త బెడద

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నీలమాధవ ఉలక బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు టికెట్ ఆశించి భంగపడ్డ ఉలకను శనివారం ఏఐసీసీ పరిశీలకులు రవీంద్ర డాల్వి బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయితే తాను కొన్నాళ్లుగా ఎన్నికల బరిలో దిగుతానని, అందుకు సంబంధించి ప్రజామద్దతు సమకూర్చుకున్నప్పటికీ అధిష్టానం టికెట్ ఇవ్వకుండా మొండి చెయ్యి చూపించడంతో ఉలక మనస్థాపానికి గురయ్యారు. అందుకే ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేస్తానని తెగేసి చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నీలమాధవ ఉలకకు ఓటు వేయండి అని ముద్రించిన ఓ బనియన్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఈ క్రమంలో ఆయన తప్పనిసరిగా బిసంకటక్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని తెలుస్తోంది. మాజీ మంత్రి డొంబురుధర ఉలక తనయుడైన నీలమాధవ ఉలకకు ఇటు బిసంకటక్, మునిగుడ ప్రాంతాల్లో మంచి పట్టుంది.

కాంగ్రెస్ ఓట్లు చీలే అవకాశం

టికెట్టు ఆశించి భంగపడ్డ నీలమాధవ ఉలక ఒకవేళ రెబల్‌గా ఎన్నికల్లో బరిలోకి దిగితే కాంగ్రెస్ ఓట్లు చీలే అవకాశం ఉంది. ఇక్కడ పోటీ చేస్తున్న నీలమాధవ హికకకు మంచిపట్టుంది. ఆయన ప్రజాదరణను గుర్తించిన అధిష్టానం ఉలకను కాదని హికకకు టికెట్టు ఖరారు చేసింది. ఈసారి ఈ నియోజకవర్గాన్ని ఎలాగైనా కాంగ్రెస్ కైవసం చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్న క్రమంలో అధిష్టానానికి ఈ రెబల్ బెడద మరింత తలనొప్పిగా మారింది.

అంత సులువు కాదు..

మంత్రి జగన్నాథ సరకకు ఈసారి విజయం అంతసులభతరం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బిసంకటక్ నుంచి పోటీ చేసి వరుసగా రెండు సార్లు విజయం సాధించిన జగన్నాథ సరక ఈసారి గట్టి పోటీ ఎదుర్కొనే అవకాశం ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన 12 వేల ఓట్లు ఆధిక్యంతో గెలుపొందారు. ఈసారి సరకను ఓడించాలన్న ఉద్దేశంతొ ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్ నీలమాధవ హికకను బరిలోకి దించింది. బీజేపీ ఇంతవరకు అభ్యర్థిని ఖరారు చేయలేదు. ఈ ప్రాంతంలో మంచి ప్రజాదరణ గల జగన్నాథ నుండ్రుక కొద్ది రోజుల క్రితం బీజేడీకి గుడ్‌బై చెప్పి బీజేపీలొ చేరారు. ఈ నేపథ్యంలో నుండ్రుకకు టిక్కెట్టు లభిస్తే సరక గట్టి పోటీ ఎదుర్కొనే అవకాశం ఉంది.

వాహనం ఢీకొని వానరం మృతి



మరణించిన వానరాన్ని తరలిస్తున్న అటవీ సిబ్బంది

జయపురం: సబ్ డివిజన్‌లోని బొయిపరిగుడ సమితి విజయవాడ–రాంచీ 326 జాతీయ రహదారిలో మహుళీ ఘాట్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని వానరం మృతిచెందింది. విషయం తెలుసుకున్న బొయిపరిగుడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వానర కళేబరాన్ని పశు చికిత్సా కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం దహణ సంస్కారాలు పూర్తి చేసినట్లు అటవీ విభాగాధికారి సందీప్ పాణిగ్రాహి తెలిపారు. కాగా, మహుళి గ్రామ సమీపంలో శివాలయం ఉంది. ఇక్కడికి వచ్చే భక్తులు ఫలాలు సమర్పిస్తుంటారు. దారిలో వెళ్తూ కోతులకు పండ్లు, బిస్కెట్లు వంటి తినుబండారాలు వేస్తుంటారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వానరం మృతిచెందిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



జయపురం:యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం



బరంపురం:హన్‌మాన్ మందిర్‌లో పూజలందుకుంటున్న స్వామివారు



రాయగడ: పూజలందుకుంటున్న ధ్యాన హనుమాన్

జయపురం: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జయపురంలో చిరంజీవి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం వందలాది మంది మహిళలతో అష్టోత్తర కలశ జాతర నిర్వహించారు. అనంతరం సీతారాముల శాంతా కల్యాణం నిర్వహిచారు. శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను జమాల్ లైన్‌లోని శ్రీరామమందిరం నుంచి దైనిక బజారులోని వీర హనుమాన్ పూజా మందిరం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, బీజేడీ మహిళా నేత, వైస్ చైర్‌పర్సన్ సునీత తదితరులు పాల్గొన్నారు.

- బరంపురం: హన్‌మాన్ జయంతి సందర్భంగా హనుమాన్ బజార్ మెయిన్ రోడ్డులోని ఆంజనేయుని మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రామలింగేశ్వర్ ట్యాంక్ రోడ్డులోని హనుమాన్ మందిర్ తదితర ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.
- రాయగడ: పట్టణంలోని హనుమాన్ మందిరాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డైలీ మార్కెట్ వద్ద ధ్యాన హనుమాన్ మందిరంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జయపురం: సీతారాముల కల్యాణానికి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు



జయపురం:ఉత్సవాలలో భజన బృందం



జయపురం:ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగిస్తున్న భక్తులు



జయపురం:కలశ యాత్రలో మహిళలు

క్లుప్తంగా

బహురూప శక్తి స్వరూపిణి



కాళికా అలంకరణలో కుదియారి జగులై మాత

భువనేశ్వర్: వసంత నవ రాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని రాష్ట్రంలో ప్రముఖ శక్తి పీఠాల్లో కొలువు దీరిన అమ్మవారు బహు రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తుల తాకిడితో ప్రాంగణాలు కిటకిటలాడు తున్నాయి.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా విడుదల

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న శాసన సభ ఎన్నికలకు అభ్యర్థుల్ని ఖరారు చేస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆదివారం మరో జాబితా విడుదల చేసింది. 75 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల్ని ఖరారు చేసింది. గతంలో 2 విడతల్లో అభ్యర్థుల జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో 17 లోక్‌సభ, 49 శాసన సభ స్థానాలకు అభ్యర్థుల్ని ఖరారు చేశారు. తాజాగా 75 మంది అభ్యర్థులతో జాబితా జారీ కావడంతో రాష్ట్రంలో మరో 23 స్థానాలకు కాంగ్రెసు ఎమ్మెల్యే అభ్యర్థుల్ని ఖరారు చేయాల్సి ఉంది. నాలుగు లోక్ సభ స్థానాలకు కూడా అభ్యర్థుల్ని ఖరారు చేయాల్సి ఉంది.

పెయింటింగ్ మేస్త్రీ ఆత్మహత్య



మృతుడు సోమేశ్వరరావు (ఫైల్)

నరసన్నపేట: మండలం గడ్డెయ్యపేట జగనన్న కాలనీలో నివసిస్తున్న పెయింటింగ్ మేస్త్రీ గండి సోమేశ్వరరావు(62) ఆత్మహత్యకు పాల్పడ్డారు. మద్యంలో పురుగుల మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ నెల 11వ తేదీ రాత్రి తన ద్విచక్ర వా హనంపై ఇంటి నుంచి వెళ్లిన సోమేశ్వరరావు ఆదివారం సాయంత్రం సత్యవరం కూడలి వద్ద ఒక చెరువు గట్టుపై శవమై కనిపించారు. ఇంట్లో మనస్పర్థలే ఆయన ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది. ఆయనకు స్థానికంగా పె యింటర్‌గా మంచి గుర్తింపు ఉంది. 11న ఇంటి నుంచి వెళ్లిన సోమేశ్వరరావు కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు పరిసర గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో గాలించారు. ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఉదయం నరసన్నపేట పోలీసులకు సోమేశ్వరరావు కుమా రుడు గిరిబాబు ఫిర్యాదు చేశాడు. ఇంతలో ఆయన మృతదేహాన్ని నరసన్నపేట పోలీసులు గుర్తించారు. మృతదేహం బాగా ఉబ్బి దుర్వాసన వస్తోంది. సోమేశ్వరరావు మృతిపై ఆయన భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి సంఘటన స్థలం వద్దే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

సోంపేట: మండలంలోని కొర్లాం–బారువ జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో మామిడిపల్లి గ్రామ పంచాయతీ రాజాం గ్రామానికి చెందిన డి.నాగేశ్వరరావు (50) మృతి చెందారు. బారువ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం గ్రామానికి చెందిన డి.నాగేశ్వరరావు, మామిడిపల్లి గ్రామానికి చెందిన తోట తులసీరావు వ్యక్తిగత పనులకు బైక్‌పై మండలంలోని బెంకిలి గ్రామానికి బయల్దేరారు. కొర్లాం జాతీయ రహదారి నుంచి బారువ వైపు వెళ్లే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. దీంతో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా తులసీరావుకు గా యాలయ్యాయి. నాగేశ్వర రావు భార్య డిల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బారువ ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగేశ్వరరావు మృతితో రాజాం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

'ఏఓబీలో పక్కాగా తనిఖీలు'

మెళియాపుట్టి: ఏఓబీ సరిహద్దుల్లో నిఘా మరింత మెరుగు పడాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఏసీ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం ఆంధ్ర, ఒడిశా సరిహద్దు వసుంధర అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఆయన తనిఖీ చేశారు. గంజాయి, నిషేధిత మద్యం, మత్తు పదార్థాల అక్ర మ రవాణా జరగకుండా సిబ్బంది ప్రతి వాహనాన్ని పక్కాగా తనిఖీ చేయాలని అన్నారు. సరిహద్దుల్లో అనుమానితులుగా కనిపించే ఏ వ్యక్తినైనా వెంటనే అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులు అప్పగించాలన్నారు. ఆయనతో పాటు పలాస ఏఈఎస్ హనుమంతరావు, సీఐ రాజశేఖర్ నాయుడు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్



రాయగడ: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన నెక్కంటి, అనసూయా తదితరులు



రాయగడ: అంబేడ్కర్‌కు నివాళులు అర్పించిన కలెక్టర్ మహాజన్, కుహరో తదితరులు



బరంపురం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వల్లభాయ్ సమాజ్ ప్రతినిధులు



కొరాపుట్: నివాళులు అర్పిస్తున్న కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్



జయపురం: పారాబెడ కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నేతలు



పర్లాకిమిడి: దండమాల వీధిలో నివాళులు అర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు



బరంపురం: ఛత్రపూర్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీపీఆర్ రబి కుమార్ బెహరా



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర



కొరాపుట్: నివాళులు అర్పిస్తున్న బీజేడీ ఎంపీ అభ్యర్థి కౌసల్య హిక్క



పర్లాకిమిడి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



కొరాపుట్: ఉమ్మర్‌కోట్‌లో నివాళులు అర్పిస్తున్న నవీనా గోండో, సుభాష్ గోండో

రాయగడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం రాయగడ కొత్త బస్టాండ్ వద్ద రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, బీడీఓ అమూల్య సాహు హాజరై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, రాయగడ శాసనసభ బీజేడీ అభ్యర్థి అనసూయా మాఝి, రాయగడ సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

- కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏడీఎంలు మహేష్ చంద్ర నాయక్, నవీన్‌చంద్ర నాయక్ పాల్గొన్నారు. ఉమ్మర్ కోట్‌లో బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీనా గొండో రాజ్యాంగ నిర్మాతకు నివాళులు అర్పించారు. ఉమ్మర్ కోట్ ఎమ్మెల్యే సుభాష్ గోండో పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రఘురాం పాడాల్, కొరాపుట్ లోక్‌సభ బీజేడీ ఎంపీ అభ్యర్థి కౌసల్య హిక్కాలు నివాళులు అర్పించారు.
- జయపురం: పారాబెడ కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మహాదళిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బృందావన ఖొర పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సలహాదారు జి.మహేష్, సరోజ్ బొత్ర, సురేంద్ర ఖొర, బాసు నాయిక్, సదా నాయిక్, తులారామ్, బొడొనాయిక్ తదితరులు పాల్గొన్నారు.
- బరంపురం: కోర్టు పేట జంక్షన్‌లో సర్దార్ వల్లబాయి పటేల్ బహుముఖి సమాజ్, సొంసర్, దళిత సహాయక ప్రతీష్ఠాన్ సంస్థల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.
- మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి డీఐపీఆర్‌ఓ ప్రమిళా మాఝి, జిల్లా యువజన అధికారి హరీష్ రూపాల్, సత్యనారాయణ కాలేజ్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

మంత్రి సరకకు చుక్కెదురు



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

- రఘుబారిలో తాగునీటి సమస్యపై నిలదీసిన మహిళలు
- గ్రామస్తులపై దౌర్జన్యానికి దిగిన మంత్రి అనుచరులు



గ్రామ యువకులపై దౌర్జన్యానికి దిగిన సరక అనుచరులు



గ్రామస్తులను బుజ్జగిస్తున్న సుధీర్ దాస్ (గ్రీన్ షర్టు)

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి రఘుబారి గ్రామంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరకకు చుక్కెదురయ్యింది. తాగునీటి సమస్యను పరిష్కరించలేదని మహిళలు మంత్రిని నిలదీశారు. దీంతో ఆయన అనుచరులు గ్రామస్తులపై చేయిచేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బిసంకటక్ శాసనసభ నుంచి మూడో సారి ఎన్నికల బరిలో నిల్చున్న మంత్రి సరక ఆదివారం బిసంకటక్ సమితి రఘుబారి గ్రామానికి ప్రచారానికి వెళ్లారు. దీంతో మంత్రిని గ్రామస్తులు నిలదీశారు. ఏదాదిగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నా అధికారులు గానీ, నాయకులు గానీ పట్టించుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పట్టించుకోలేని ఓట్లు ఎలా వేస్తామని ఖరాఖండిగా చెప్పారు. ఈ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ప్రాతినిథ్యం వహించినా సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నించారు. గెలిచిన తర్వాత ఒక్కసారి కూడా తమ గ్రామంలో పర్యటించని సరక ఇప్పుడు ఎన్నికలు వస్తుండటంతో ఓట్లు కోసం రావడం సమంజసంగా లేదని దుయ్యబట్టారు. ఈ క్రమంలో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో మంత్రి అనుచరులు, కార్యకర్తలు, మద్దతుదారులు ఒక్కసారిగా మహిళలపై దురుసుగా మాట్లాడారు. కొందరు యువకులు వారిని అడ్డుకోవడంతో వారిపై సరక అనుచరులు దాడికి దిగారు. ఈ క్రమంలో కొంతమంది యువకులపై దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకొనడంతో మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మంత్రి వెంట ఉన్న బీజేడీ రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి సుధీర్ దాస్ గ్రామస్తులను బుజ్జగించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ముగిసిన దొండనచో దీక్షలు

బరంపురం: గంజాం జిల్లాలో చైత్రమాసం సందర్భంగా రెండు వారాలుగా చేపట్టిన దొండనచో దీక్షలు ఆదివారం మేరు సంక్రాంతి సందర్భంగా ముగిశాయి. జిల్లాలో వివిధ చోట్ల నుంచి దీక్షాధారులు తరలివచ్చి దొండ కాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కఠోర ప్రదర్శనలు నిర్వహించారు. ఉపవాసాలతో ఉన్నా దీక్షాధారులంతా సాయంత్రం చెరువుల్లో స్నానం చేసి అనంతరం ప్రసాద సేవనం గావించారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



గగుర్పొడిచే విన్యాసాలు



కొండాసింగ్‌లో ఆలయం వద్ద భక్తుల రద్దీ



పంచావోర్తుల వీధిలో అగ్ని గుండంలో తలకిందులుగా వేలాడుతూ..



దీక్షాధారులు

అనుమానాస్పద రీతిలో గిరిజనుడు మృతి



సవర చంద్రయ్య (ఫైల్)

బూర్జ: మండలంలో గల మదనాపురం జంక్షన్ నుంచి బొమ్మిక గ్రామం రహదారిలో సవర చంద్రయ్య (48) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలియజేసిన వివరాలు ప్రకారం.. చంద్రయ్య బూర్జ మండలం జంగాల పాడు గ్రామానికి చెందినవారు. ఆయన శనివారం ఉదయం బంధువుల వివాహం కోసం బొమ్మిక గ్రామం వెళ్లారు. అయితే పెళ్లికి వచ్చిన వ్యక్తి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆదివారం ఉదయం మదనాపురం జంక్షన్ నుంచి బొమ్మిక గ్రామం రహదారిలో గల తాటి చెట్లు తోటలో విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు చూసి పోలీసులకు చెప్పడంతో వారు వెళ్లి మృతుడిని చంద్రయ్యగా గుర్తించారు. శనివారం సాయంత్రం నుంచే మద్యం మత్తులో పడి ఉన్నాడని, ఎవరూ పట్టించుకోక పోవడంతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య సవర పున్నమ్మ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయ న మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య సవర పున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జీవీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన టెక్నవెర్స్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. ఎస్ఎంపురం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో మూడు రోజులు పాటు నిర్వహించిన టెక్న వెర్స్ టెక్నికల్ ఫెస్ట్ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలు వెలికి తీసేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. పలు కీలక అంశాల్లో పారిశ్రామిక నిపుణులు, ఐఐటీ, ఎన్ఐటీ ప్రొఫెసర్లతో వర్క్‌షాపులు నిర్వహించినట్లు చెప్పారు. పరిపాలన అధికారి మునిరామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఎలక్ట్రానిక్ వాహనాలు, డ్రోన్ టెక్నాలజీ, విపత్తులు ఎదుర్కోవటం, ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్, త్రీడీ టెక్నాలజీ, ఎమర్జింగ్ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ఎచ్చెర్ల: లావేరు మండలంలోని చిన్నకొత్తకోట గ్రామానికి చెందిన బంటు దుర్గారావు (30) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో మరో యువకుడు దూసి గణే ష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. చిన్న కొత్తకోట గ్రామానికి చెందిన వీరిద్దరూ తగరపువలసలోని దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇక్కడే ఉంటున్నారు. ఇదే కంపెనీలో పనిచేస్తున్న స్నేహితుని వివాహానికి బైరిసింగిపురం వెళ్లిన వీరు బైక్‌పై తిరిగి తగరపువలస వస్తుండగా బొంతుపేట సమీపంలో జాతీయరహదారిపై శనివారం రాత్రి 12 గంటల సమయంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి అదుపు తప్పి కింద పడ్డారు. వెనుక కూర్చున్న దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడిపిన గణేష్‌కు స్వల్పంగా యాలయ్యాయి. దుర్గారావు తండ్రి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు లావేరు ఎస్ఐ సీహెచ్ స్వామినాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ విహంగాల తిరుగు ప్రయాణం



తేలినీలాపురంలో తిరిగి తమ దేశానికి వెళ్తున్న విదేశీ పక్షులు

టెక్కలి రూరల్: టెక్కలి మండలం తేలినీలాపురం గ్రామంలో గల విదేశీ పక్షుల విడిది కేంద్రంలో ఉన్న విదేశీ పక్షులు తిరిగి తమ దేశమైన సైబీరియాకు ప్రయాణమవుతున్నాయి. ఏటా సెప్టెంబర్, అక్టోబర్ మధ్యలో సైబీరియా నుంచి వేలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి టెక్కలి మండలం తేలినీలాపురం గ్రామానికి వస్తుంటాయి. ఇక్కడే గుడ్లు పెట్టి ఆ పిల్లలు ఎగిరేంత వరకు ఉండి మార్చి నెలాఖరు నుండి ఏప్రిల్‌లో వెళ్లిపోతుంటాయి. ఈ ఏడాదిలో పె యింటెడ్ స్టార్క్, పెలికాన్ పక్షులు కలిసి 1003 వచ్చాయని అవి 780 పిల్లలను పొదిగి మొత్తం 1783 పక్షులు తిరిగి తమ దేశానికి వెళ్తున్నట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

క్లుప్తంగా

ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు



విధుల్లో మరణించిన వారికి నివాళులర్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

విజయనగరం క్రైమ్ : దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా జరిగే అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ వారోత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నట్లు సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ విధులు నిర్వహిస్తూ మరణించిన వారికి నివాళులు అర్పించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వెంకటరావు కరపత్రాలు,బ్యానర్స్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటిన్నర విలువైన బంగారు ఆభరణాలు, నగదు పట్టివేత



బంగారు ఆభరణాలు, నగదును అధికారులకు అప్పగిస్తున్న వన్‌టౌన్ పోలీసులు

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం తనిఖీలు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో స్థానిక కన్యకపరమేశ్వరీ ఆలయం వద్ద పోలీసులు రాత్రి సమయంలో నిర్వహించిన తనిఖీల్లో ఒక వ్యక్తి వద్ద 2 కిలోల 663 గ్రాముల బంగారు వస్తువులు, రూ.17 లక్షల 95వేలు నగదు పట్టుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ఆదివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. భీమిలి మండలం అన్నవరం గ్రామానికి చెందిన అమర రాజయ్య విశాఖ గోల్డ్ గెయిన్ అనే జ్యూయలరీ షాపులో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. షాపు యజమాని పవన్‌కుమార్ విజయనగరంలోని బంగారు షాపులకు వస్తువులను విక్రయించి, డబ్బులు తీసుకుని రమ్మని చెప్పడంతో వాటిని విజయనగరం తీసుకువచ్చినట్లు విచారణలో వెల్లడించారని సీఐ తెలిపారు. అయితే అతని వద్ద ఎటువంటి పత్రాలు, ఆధారాలు లేకపోవడంతో అతన్ని అదుపులోకి తీసుకుని, 2.663 కిలోల బంగారు వస్తువులు సుమారు కోటీ 51 లక్షల 10వేలు విలువైన వస్తువులతో పాటూ రూ.17 లక్షల 95వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా గ్రీవియన్స్ కమిటీ, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు తదుపరి చర్యల నిమిత్తం పంపించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

విద్యార్థినులకు అభినందన

దెంకాడ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన మండలంలోని మోపాడ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం) విద్యార్థినులను ప్రిన్సిపాల్ జి.భవాని, సిబ్బంది ఆదివారం అభినందించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో 34 మందికి గాను 33 మంది, ప్రథమ సంవత్సరానికి సంబంధించి, 37 మందికి 35 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థుల్లో 25 మందికి పైగా 800 మార్కులు పైబడి వచ్చాయని తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థుల్లో 20 మందికి 400కు పైగా మార్కులు వచ్చాయన్నారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువుల్లోనూ మరింత రాణించాలని ఆకాంక్షించారు.

30 మద్యం బాటిల్స్ పట్టివేత

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యాపారిని పట్టుకుని, 30 మద్యం బాటిల్స్ సీజ్‌చేశామని ఎస్సై ఇ.శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. సమాచారం మేరకు ఆదివారం చేపట్టిన దాడుల్లో మద్యం బాటిల్స్‌తో నిందితుడిని పట్టుకుని కేసునమోదుచేశామని వెల్లడించారు.

20 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్టు

మెంటాడ: మండలంలోని జయితి శివారు గ్రామమైన బిరసాడవలస వద్ద అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. దీనిపై హెడ్‌కానిస్టేబుల్ రమణ ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 20 మద్యంబాటిల్స్ తీసుకువెళ్తున్న వ్యక్తిని ముందస్తు సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు

శృంగవరపుకోట: పెళ్లి నుంచి వస్తూ ఆటో బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో ఆరుగురు గాయాలపాలయ్యారు. వేపాడ మండలం కొండగంగుబూడి నుంచి గంట్యాడ మండలం అడ్డతీగ గ్రామానికి పెళ్లికి కొంతమంది వెళ్లారు. శనివారం రాత్రి పెళ్లయిన తర్వాత ఆదివారం ఉదయం పెండ్లి కుమార్తెకు ఆరోగ్యం నలతగా ఉండడంతో ఆమెను తీసుకుని ఆటోలో ఎస్.కోట ఆస్పత్రికి బయల్దేరారు. ఎస్.కోట వస్తుండగా రాజీపేట గ్రామం వద్ద ఆవు అడ్డంగా రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది, ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సారి శివ కాలు విరిగిపోయింది. మరో మహిళ జన్ని మంగ తలకు తీవ్రగాయం అయ్యింది. మిగిలిన నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

ప్రతిపక్షాలకు టాటా..బై..బై..!

- టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు
- పూతికపేట గ్రామం నుంచి 180 కుటుంబాల చేరిక



నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, నేతలు

నెల్లిమర్ల రూరల్: జిల్లాలోని ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలకు గుడ్‌బై చెప్పేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన పట్ల ఆకర్షితులై అధికార వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నెల్లిమర్ల మండలంలోని పూతికపేట గ్రామంలో టీడీపీ, జనసేన కూటమికి భారీ ఎదురదెబ్బ తగిలింది. ఆ రెండు పార్టీలను వీడి సుమారు 180 కుటుంబాల వారు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. గ్రామానికి చెందిన యడ్ల నర్సింగరావు ఆధ్వర్యంలో రెడ్డి పైడిరాజు, శీల సూర్యనారాయణ, యడ్ల రమణ, పైడినాయుడు, పెనుమజ్జి రమణ, తదితర టీడీపీ, జనసేనలకు చెందిన కుటుంబాల వారు మొయిద విజయరామపురం వెళ్లి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం పార్టీలో చేరినవారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తమకు నిష్పక్షపాతంగా సంక్షేమ ఫలాలు అందించారని, ఆయన పాలన నచ్చి పార్టీలో చేరామని చెప్పారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు నెక్కల నాయుడు బాబు, జెడ్పీటీసీ గదల సన్యాసి నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాంలో 80 కుటుంబాలు..

మెరకముడిదాం: మండలంలోని గాదెలమర్రివలస, గొట్టుపల్లి గ్రామాలకు చెందిన 65 కుటుంబాల వారు టీడీపీని వీడి జిల్లాపరిషత్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ మజ్జిశ్రీనివాసరావు సమక్షంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ జెడ్పీ చైర్మన్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గాదెలమర్రివలస నుంచి గొర్లెమోహన్‌రావు, గొర్లెరామునాయుడు, గాదెలరామస్వామి, నడిరెట్లఅప్పలనాయుడు, వలిరెడ్డివెంకటరమణ, యలకలసాంబయ్య, చొక్కనారాయణ, అల్లాడ శ్రీరాములు, ఉయ్యాలసింహాచలం తదితర 50 కుటుంబాల వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే మండలంలోని గొట్టుపల్లి గ్రామానికి చెందిన సుంకరిశంకరరావు, బైరెడ్డివెంకటేష్, బైరెడ్డి రామారావు, సుంకరిచిన్నంనాయుడు, పతివాడసూర్యనారాయణ, సుంకరిగోవింద, మానాపురం గౌరి, గూనాపు అప్పలనాయుడు, అగురురాంబాబు, తాడేలసత్యం, సుంకరిరాములు, సుంకరిపవన్ తదితర 15 కుటంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలో చేరినవారంతా రానున్న సాధారణ ఎన్నికల్లో కష్టపడి పార్టీ అభ్యర్థులైన చీపురుపల్లి ఎమ్మెల్యేగా బొత్ససత్యనారాయణ, విజయనగరం ఎంపీగా బెల్లానచంద్రశేఖర్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్వీ రమణరాజు, తాడ్డివేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు, కేఎస్ఆర్ ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, గాదెలమర్రివలస సర్పంచ్ అట్టాడదేవ, గొట్టుపల్లి సర్పంచ్ సుంకరిరమేష్ తదితరులు పాల్గొన్నారు.



మెరకముడిదాం: వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరిన గాదెలమర్రివలస గ్రామస్తులతో జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు

రాజాంలో 50 కుటుంబాలు..

రాజాం: రాజాం మున్సిపాల్టీ పరిధిలోని బుచ్చింపేట గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈ మేరకు గ్రామానికి చెందిన వారంతా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ సమక్షంలో పార్టీలో చేరి కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కోన లక్ష్మణ, కోన పోలయ్య, కోన సూరి, కోన రాము, కోన సీతయ్య, ఎర్ర రాము, ఎర్ర సూరి, ఎర్ర గుర్రయ్య, ఎర్ర ప్రసాద్, ఎర్ర కొండపర్తై సురేష్, దుగ్గు రాము, దుర్రబార శేఖర్, రామరమణ, బూర్లి గణశేఖర్, బూర్లి రాము, డొక్కర రమేష్, డొక్కర సురేష్, డొక్కర తిరుపతి, పిట్టా అప్పన్న, బోర గోవింద, దుక్క శంకర్, డొప్ప తిరుపతి, ఎర్ర ప్రసాద్, ఎం.రాము, డొక్కర రమేష్, రాము, పిలక అసిరినాయుడు, గుణుపూరు అప్పన్న, గంగయ్య, పాము చిన్న, పిట్ట అప్పన్న, సీనయ్య, శ్రీరాము, బోర లోకేష్, శేఖర్, దిలీప్, కోన గణేష్, గోవింద, రాము, డొప్ప అప్పన్న తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తోందని, వైఎస్సార్‌సీపీ ద్వారానే రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందుతోందని వెల్లడించారు. ఇక్కడ ఎమ్మెల్యేగా డాక్టర్ రాజేష్‌ను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు పిట్టా జగదీష్, నమ్మి పార్వతీరావు, ముద్దాడ అప్పన్న, కోరాడ రామినాయుడు, బట్టికాళ రాము, నమ్మి రాము, నమ్మి అప్పన్న, పిట్ట సూరి, ఆంబాన తమ్మయ్య, నమ్మి సత్యనారాయణ, పిట్టా శంకర్, నమ్మి అసిరినాయుడు, కోరాడ రాము, గ్రామానికి చెందిన యూత్ సభ్యులు పాల్గొన్నారు.



గొట్టుపల్లి గ్రామస్తులతో జెడ్పీచైర్మన్

పార్వతీపురంలో 50 కుటుంబాలు..

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పురపాలక సంఘం పరిధి 23వ వార్డులో టీడీపీ, జనసేనలకు చెందిన 50 కుటుంబాల వారు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే జోగారావు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించి..సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయాని పిలుపునిచ్చారు. తామంతా టీడీపీలో దశాబ్దాలుగా ఉంటున్నప్పటికీ తమకు మేలు జరగలేదని, ఏదైనా మేలు జరిగిందంటే కేవలం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనేనని, భవిష్యత్తులో మరింత మేలు జరుగుతుందన్న అధికార పార్టీలో చేరామని వారంతా చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవి కుమార్, స్థానిక కౌన్సిలర్ మంత్రి ఉమామహేశ్వరి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజాం: వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీకార్యకర్తలు



పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బాలికపై లైంగికదాడి యత్నం

- విలేకరిపై పోక్సో కేసు నమోదు



నిందుతుడు శ్రీనివాస రాజు



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, ఎస్సై గోవిందరావు

లక్కవరపుకోట: అభంశుభం తెలియని చిన్నారిపై మానవ మృగం లైంగిక దాడికి పాల్పడిన ఘటన లక్కవరపుకోట మండల కేంద్రంలో ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, ఎస్సై ఆర్.గోవిందరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒక పత్రికా విలేకరిగా (సాక్షి కాదు) పనిచేస్తున్న పాకలపాటి శ్రీనివాసరాజు (47) మండల కేంద్రంలో మూడు సంవత్సరాలుగా నివాసముంటున్నాడు.ప్రైవేట్ పాఠశాలల్లో పీఈటీగా పనిచేస్తూ ,విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ నేర్పడం ఆయన ప్రవృత్తి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న 8,7 సంవత్సరాలు వయస్సు గల ఇద్దరు అక్కాచెల్లెళ్లను మేడపైకి తీసుకెళ్లాడు. అక్కను గదిలోకి తీసుకెళ్లి తలుపువేసి చిన్న పాపను బయటకు వెళ్లిపోమన్నాడు. దీంతో చిన్న పాప తల్లివద్దకు వెళ్లి రాజు మాస్టారు అక్కను మేడ పైకి తీసుకెళ్లాడని చెప్పింది. గంట దాటినప్పటికీ ఎంతకీ బాలిక ఇంటికి రాకపోవడంతో బాధితురాలి తల్లి, మరో వ్యక్తి విలేకరి ఇంటికి వెళ్లి పిలవగా ఎంతకీ తలుపు తీయలేదు. దీంతో బలవంతంగా దబాయించడంతో తలుపుతీశాడు. అప్పటికే నిందితుడు, చిన్నారి వంటిపై వస్త్రాలు లేవు. బాలిక గుక్కపెట్టి ఏడుస్తోంది. కోపోద్రిక్తురాలైన బాలిక తల్లి నిందితుడు శ్రీనివాసరాజును కొట్టి మేడపైనుంచి కిందికి తీసుకొచ్చి ఆ ఇంటి చుట్టుపక్కల వారికి జరిగిన విషయం చెప్పడంతో వారంతా కలిసి దేహశుద్ధి చేసేందుకు ప్రయత్నించగా నిందితుడు తప్పించుకుని పరారయ్యాడు. ఈ ఘటనపై ఆదివారం ఉదయం బాధిత చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవిందరావు తెలిపారు. ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి ఎస్.కోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్.ఉపేంద్ర, ఎస్సై గోవిందరావులు వెళ్లి చుట్టుపక్కల వారిని విచారించి మరింత సమాచారం సేకరించారు.

17న సీతారాముల కల్యాణ మహోత్సవం

విజయనగరం రూరల్:

నగర పరిధిలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో ఈ నెల 17వ తేదీన శ్రీరామనవమి పురస్కరించుకుని, సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక ఎన్‌సీఎస్ మల్టీప్లెక్స్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శ్రీరామనవమి రోజున ఉదయం 7 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

స్వామి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు విజయనగరం ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఎన్‌సీఎస్ మల్టీప్లెక్స్ వద్ద మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతోందన్నారు. అనంతరం శ్రీరామనవమి వేడుకల ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం నీరజవల్లి, డైరెక్టర్ గౌరీనిత్య, అర్చకులు చాణక్య తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్




అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ ఎం.దీపిక, తదితరులు


- జిల్లా పోలీస్ కార్యాలయంలో నివాళులర్పించిన ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: బడుగు, బలహీనవర్గాల ఆరాధ్య దైవం, దేశంలోని అన్ని వర్గాలకు ఆదర్శమూర్తి. ఉన్నత వర్గాల నుంచి వివక్ష ఎదుర్కొంటూ, ఎన్ని ఇబ్బందులు వచ్చినా లక్ష్యసాధనలో వెనుకంజ వేయకుండా, ఉన్నత చదువులు చదివి భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ చిరస్మరణీయుడని ఎస్పీ ఎం.దీపిక కొనియాడారు. ఈ మేరకు అంబేడ్కర్ 133వ జయంతిని స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి ఆమె పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమానత్వం ఉండాలని, సమాన వేతనాలు ఉండాలని, రాజ్యాంగం ద్వారా హక్కులను అంబేడ్కర్ కల్పించారన్నారు. మహిళలకు ఎక్కడ సమున్నత స్థానం ఉంటే అక్కడ అభివృద్ధి ఉంటుందని భావించి, రాజ్యాంగంలో మహిళలకు సముచితస్థానం కల్పించిన విజ్ఞాన వేత్త అంబేడ్కర్ అని కొనియాడారు. దేశంలో కుల,మత, లింగ విభేదాల్లేకుండా అందరికీ సమానహక్కులు, సమానత్వం కల్పించిన మహనీయుడన్నారు. ఆయన మార్గంలో తామంతా పునరంకితులమై, సమాజానికి, దేశానికి అవసరమైన సేవలందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, చీపురుపల్లి సీఐ ఏఎస్.చక్రవర్తి, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, ఆర్‌ఐలు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.భగవాన్, ఎస్బీ సీఐ కేకేవీ.విజయనాథ్, రాజాం సీఐ మోహనరావు, సర్కిల్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఆర్ఎస్సైలు వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన దేముడు



ప్రమాదంలో చనిపోయిన పెంటయ్య

జామి: మండలకేంద్రం జామిలో విద్యుత్‌షాక్‌కు గురై ఓ వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మాధవరాయి మెట్ట వద్ద పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న డైరీఫారం షెడ్డుకు సున్నాలు వేసేందుకు ఎస్.కోట మండలంలోని ఆలుగుబిల్లికి చెందిన పెయింటర్లను నియమించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలుగుబిల్లికి గ్రామానికి చెందిన మేడిశెట్టి దేముడు(48) గోడలకు సున్నం వేస్తున్న సమయంలో విద్యుత్‌వైర్లు మీద పడండతో షాక్‌కు గురై గాయపడ్డాడు. దీంతో ఎస్.కోట సీహెచ్‌సీకి ఆటోలో తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆటోలో నుంచి జారిపడి గిరిజనుడు..

వేపాడ/శృంగవరపుకోట: గ్రామం దాటి బయటికొచ్చిన గిరిజనుడు తిరుగు ప్రయాణంలో ఆటో నుంచి జారి పడి ప్రాణాలు విడిచాడు. వేపాడ మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ పరిధిలో ఆదివారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. బందవలస గ్రామానికి చెందిన పాత బోయిన పెంటయ్య(61) మధ్యాహ్నం ఆటోలో తన గ్రామానికి వెళ్తూ జారి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని హుటాహుటిన ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుని భార్య..తన భర్త బొద్దాం సంతకు వెళ్లి మద్యం తాగి తిరిగి గ్రామానికి ఆటోలో వస్తూ జారిపడి చనిపోయాడంటూ వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టీడీపీ మీటింగ్‌కు వెళ్లి వస్తుండగా..?

మండలంలోని కొండగంగుబూడిలో టీడీపీ ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి, చల్లా వెంకటరావుల నేతృత్వంలో ఎన్నికల ప్రచార సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల నుంచి గిరిజనుల్ని టీడీపీ నాయకులు రప్పించారు. వారికి భోజనాలు ఏర్పాటు చేసి పూటుగా మద్యం తాగించారు. ఈ సమావేశానికి హాజరైన పెంటయ్య మద్యం మత్తులో ఆటో నుంచి జారిపడి ప్రాణాలు వదిలినట్లు అదే సమావేశానికి హాజరైన కొందరు చెబుతున్నారు. అయితే ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకు సంతకు వెళ్లివస్తుండగా ప్రమాదం జరిగిందని మృతుడి భార్యతో టీడీపీ నేతలు ఫిర్యాదు చేయించడం గమనార్హం.

ఇంటిగోడపై పైడి వ్యక్తి..

సీతంపేట: మండలంలోని జమ్మడుగూడలో ఇంటి గోడ మీద పడిపోయిన సంఘటనలో గాయపడిన వ్యక్తి శ్రీకాకుళం రిమ్స్‌లో ఆదివారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సవర గంగరాజు (38) పాత మట్టి గోడలతో ఉన్న తన రేకుల ఇల్లును కూల్చి కొత్త ఇల్లు కట్టుకుందామని నిర్ణయించాడు. ఈ క్రమంలో ఇంటి పాత గోడను తానే తవ్వుతుండగా ప్రమాదవశాత్తు మట్టి గోడ పెల్లలు మీద పడడంతో గాయాలపాలవగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య ఆదమ్మ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ జనార్దనమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

జగనన్న కాలనీల్లో...



విద్యుత్ కాంతులు

- విద్యుద్దీకరణకు రూ.183.63 కోట్లు ఖర్చు
- జిల్లాలో 613 జగనన్న కాలనీలు
- 11,482 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు
- 967 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు



గంట్యాడ మండలం సిరిపురం జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

విజయనగరం ఫోర్ట్:

రాష్ట్రంలో పేదోడి సొంతింటి కలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేరవేర్చింది. ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేసింది. ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయడంతో పాటు అవసరమైన మౌలిక వసతులను కూడా కల్పించింది. జగనన్న కాలనీల పేరుతో వీటిని నిర్మించారు. రోడ్లు నిర్మాణం, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ సౌకర్యం ఇలా అన్నిరకాల సదుపాయాలు కల్పించారు. ముఖ్యంగా విద్యుత్ సౌకర్యం కల్పించారు. అన్ని కాలనీల్లోను విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు..

సామర్థ్యం	ట్రాన్స్‌ఫార్మర్లు
15 కిలోవాట్స్	757
25 కిలోవాట్స్	89
40 కిలోవాట్స్	68
63 కిలోవాట్స్	41
100 కిలోవాట్స్	12
మొత్తం	967

613 కాలనీల్లో విద్యుత్ వెలుగులు

జిల్లాలో 613 జగనన్న కాలనీలు ఉన్నాయి. వీటిల్లో విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.183.63 కోట్లు వెచ్చించింది. కాలనీల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశా రు. అదేవిధంగా విద్యుత్ లై న్లు కూడా వేశారు. ఇళ్లు నిర్మించిన వారికి ఉచితంగా విద్యుత్ మీటర్లు కూడా అమర్చారు.

11,482 స్తంభాల ఏర్పాటు

జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు 11,482 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇందులో 11 మీటర్ల పొడవు స్తంభాలు 777, 9.5 మీటర్ల పొడవు స్తంభాలు 715, 9.1 మీటర్ల పొడవు స్తంభాలు 8,127, 8 మీటర్ల పొడవు స్తంభాలు 2,363 ఏర్పాటు చేశారు. అదేవిధంగా 1722 కిలో మీటర్ల మేర విద్యుత్ లైన్లు వేశారు.

ఊళ్లకు ఊళ్లే..

ప్రభుత్వం పెద్దఎత్తున ఇళ్లు కట్టించడంతో ఊళ్లకు ఊళ్లే ఏర్పాటయ్యా యి. పట్టణ ప్రాంతంలోను, గ్రామీణ ప్రాంతాల్లో కూడా అధిక సంఖ్యలోనే ఇళ్లను నిర్మించారు. కొన్ని గ్రామాల్లో 100 నుంచి 150 ఇళ్లు నిర్మిస్తుండగా మరికొన్ని గ్రామాల్లో 300 నుంచి 500 వరకు ఇళ్లు నిర్మిస్తున్నారు. వీటిల్లో చాలా వరకు ఇళ్ల నిర్మాణం పూర్తయింది. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు విద్యుత్ మీటర్లు అమర్చారు.